క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



కేశవదాసుపాలెంలో చిన్నారుల కుటుంబ సభ్యులకు చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి కుటుంబానికి సీఎం జగన్ మంజూరు చేసిన రూ.2 లక్షల చెక్కును శనివారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అందజేశారు. గ్రామానికి చెందిన యర్రంశెట్టి విజయదుర్గ గతేడాది అప్పుల వాళ్ల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త కూడా మరి కొంతకాలానికి చనిపోయారు. దీంతో తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారుల దీన పరిస్థితిని ఎమ్మెల్యే రాపాక, సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఎం జగన్ స్పందించడంతో పై సాయం వారికి అందింది. యెనుముల చిట్టిబాబు, కొల్లాబత్తుల చిట్టిబాబు, గన్నాబత్తుల సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలు నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామివారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

పశు బీమాతో పాడి రైతులకు ధీమా



చిరతపూడిలో పశువుల బీమాను రైతులకు వివరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అంబాజీపేట: వైఎస్సార్ పశు బీమా పథకం పశుపోషణపై ఆధారపడ్డ పాడి రైతులకు వెన్నదన్నుగా నిలుస్తుందని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోట బేబీరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. చిరతపూడిలో వైఎస్సార్ పశు బీమా, జగనన్న పాలవెల్లువలపై పుల్లేటికుర్రు పశువైద్యాధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పి.గన్నవరం పశువైద్య సహాయ సంచాలకులు ఎల్.విజయ్‌రెడ్డి మాట్లాడుతూ పశువులకు ప్రమాదం జరిగిన సమయంలో పశు బీమా పథకం ద్వారా రైతులకు లబ్ధి పొందవచ్చన్నారు. రైతులు తమ పశువులకు సంబంధించి ఒకసారి బీమా ప్రీమియం చెల్లిస్తే మూడేళ్లపాటు అమలులో ఉంటుందన్నారు. పాడి రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న పాలవెల్లువ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. సబ్సిడీ ద్వారా మేలు జాతి గేదెను కొనుగోలు చేసుకునేందుకు సహకార సొసైటీ బ్యాంకు రుణాలు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ బొంతు ఆనంద్, వలంటీర్ బీర పుణ్యవతి, బొంతు భవాని, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లపై పడిన చెట్టు తొలగింపు

మలికిపురం: మండలంలోని గుడిమెళ్ళంక ప్రధాన రహదారిలో శనివారం కురిసిన భారీ వర్షానికి చెట్టు కూలి విద్యుత్ వైర్లపై పడింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ తరుణంలో ఆ శాఖ అధికారుల ఆధ్వర్యాన సిబ్బంది చెట్టును తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నారు.

30న బియ్యం వేలం

అంబాజీపేట: స్వాధీనం చేసుకున్న అక్రమంగా రవాణా చేస్తున్న బియ్యాన్ని ఈ నెల 30న వేలం నిర్వహించనున్నట్లు ఎంఎస్‌వో ఎం.రమాదేవి తెలిపారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లోని స్టాక్ పాయింట్ల వద్ద నిల్వ చేసిన 103.367 మెట్రిక్ టన్నుల అక్రమంగా రవాణా చేసిన రేషన్ బియ్యాన్ని ఈ నెల 30వ తేదీన 11 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తారన్నారు. ఇందుకు సంబంధించి అంబాజీపేట, పి.గన్నవరం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు, స్టాక్ పాయింట్‌లకు, కొత్తపేట ఆర్డీవోలకు ఉత్తర్వులు అందజేస్తున్నామన్నారు.

ఆర్బీకేలు.. రైతు నేస్తాలు

- రైతన్నకు అండగా ప్రభుత్వం
- వ్యవసాయ అనుబంధ పథకాలతో మేలు
- ప్రభుత్వ హయాంలో రూ.189 కోట్ల లబ్ధి



నర్శిపూడిలో రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఆలమూరు: రైతు సంక్షేమమే మన లక్ష్యం అంటూ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. వ్యవసాయం అంటే దండగ కాదు పండగ అనే విధంగా ప్రభుత్వం రైతాంగం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. రైతులకు పెట్టుబడి సాయం నుంచి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే వరకూ ప్రభుత్వం అండగా ఉంటుంది. ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటే ప్రతి పనికి మండల కేంద్రాలకు వెళ్లి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. రోజుల తరబడి తిరిగినా పనులు జరగకపోవటం, మరోపక్క వరుస నష్టాలు ఎదుర్కొంటున్న అన్నదాతకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేక వ్యవసాయం నష్టంగా మారి రైతులు తీవ్ర ఒత్తిడికి గురయ్యేవారు. పాదయాత్ర ద్వారా రైతుల కష్టాలను దగ్గరగా చూసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే)లను ఏర్పాటు చేసి అధికార యంత్రాంగాన్ని రైతులకు చేరువ చేశారు. రైతు భరోసా, వైఎస్సార్ పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రుణాలు, పంటల సాగుకు కావలసిన యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచటంతో ప్రస్తుతం రైతులకు వ్యవసాయం వరంలా మారింది. మండలంలో 9583 ఎకరాల సాగు భూమి ఉండగా 11,314 మంది రైతులు పంటల సాగు చేస్తున్నారు. మైదాన ప్రాంతం కావటంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన ప్రతిసారీ ఇక్కడ నష్ట తీవ్రత ఎక్కువగానే ఉంటుంది.

నాలుగేళ్లలో రైతులకు రూ.కోట్ల లబ్ధి

మండలంలో మునుపెన్నడూ లేని విధంగా రైతులకు యంత్రసేవా పథకం కింద రూ.32 కోట్లు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.157 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వ జమ చేసింది. గత ప్రభుత్వ హయాంలో కంటి తుడుపుగానే రైతులకు అరకొరగా పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలు అందించారు. అది కూడా పంట నష్టం జరిగిన రెండేళ్లకు గానీ రైతులకు అందేవి కావు. జన్మభూమి కమిటీల సిఫారసు కలిగిన రైతులకు మాత్రమే పథకాలను మంజూరు చేసేవారు. గత టీడీపీ అయిదేళ్ల కాలంలో రైతులకు ఇన్సూరెన్సు, ఇన్‌పుట్ సబ్సిడీల ద్వారా కేవలం రూ.73 లక్షలు మాత్రమే పంపిణీ చేయగా, రుణమాఫీ పేరుతో రూ.1.89 కోట్లు మాత్రమే ఇచ్చారు.

ఆలమూరు మండలంలో రైతులకు పథకాల వారీ సొమ్ములు ఇలా..

రైతు భరోసా

సంవత్సరం	రైతులు	సొమ్ములు (రూ.కోట్లలో)
2019-20	9572	11.23
2020-21	10842	12.67
2021-22	11045	13.46
2022-23	11085	13.91

సున్నా వడ్డీ రుణాలు

సంవత్సరం	రైతులు	సొమ్ము
2019-20	11018	167.74 లక్షలు
2020-21	11126	71.53 లక్షలు
2021-22	11314	78.64 లక్షలు

వైఎస్సార్ పంట బీమా

సంవత్సరం	రైతులు	సొమ్ము
2020-21	8976	15.16 కోట్లు
2021-22	13458	45.62 కోట్లు

ఇన్‌పుట్ సబ్సిడీ

సంవత్సరం	రైతులు	సొమ్ము
2020-21	11842	7.79 కోట్లు
2021-22	11314	8.12 కోట్లు

అందుబాటులో ఎరువులు



గ్రామంలో ఆర్బీకే ఏర్పాటు చేయడం వల్ల ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. గతంలో మాదిరిగా సుదూర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా పోయింది. స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సూచన మేరకు పంటలకు కావలసిన యూరియా, డీఏపీ వంటి ఎరువులను వారి తోనే రప్పించుకుంటున్నాం.

– తోరాటి వెంకన్న, సంధిపూడి, రైతు

ఉచిత ఈ–క్రాప్ బుకింగ్‌తో భరోసా..



ప్రకృతి వైపరీత్యాలతో పంటకు నష్టం వాటిల్లినప్పుడు తాను నష్టపోకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా ఆర్బీకేల్లో రూపాయి కూడా చెల్లించనవసరం లేకుండా పంట ఈ–క్రాప్ బుకింగ్ చేస్తున్నాం. నాణ్యమైన ఎరువులు, విత్తనాలను సకాలంలో సరఫరా చేస్తున్నాం. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు తమ వంతు కృషి చేస్తున్నాం.

– దున్నే దుర్గారావు, వీఏఏ, పెదపళ్ల

రైతులకు అందుబాటులో అధికారులు



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆలమూరు మండలంలో 23 ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలోనూ ఒక (వ్యవసాయ క్షేత్ర సహాయకులు వీఏఏ), టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) రైతులకు అందుబాటులో ఉండటంతో వారి ద్వారా సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నాం. సాగుకు కావలసిన ఎరువులు, పురుగుమందులు, యంత్రపరికరాలు రైతులకు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాం. ఎప్పటికప్పుడు రైతులు సాగుచేసే పంటలను ఈ–క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేస్తూ పండించిన పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడమే కాకుండా ప్రభుత్వ పథకాల ద్వారా అందే సహాయాలు రైతులకు సక్రమంగా అందేలా కృషి చేస్తున్నాం.

– ఎస్.లక్ష్మీలావణ్య, ఏవో, ఆలమూరు

పేదరికంతో చదువుకు దూరం కాకూడదు



వీవీ మెరక శివారు కేవీ పోడులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: పేదరికం వల్ల పిల్లలు చదువులకు దూరం కాకూడదన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం వీవీమెరక శివారు కేవీ పోడులో ఎమ్మెల్యే రాపాక అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. అర్హులకు పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని తెలుసుకుని, అందకపోతే అందించేందుకు అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు గడప గడపకు వస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. చదువుతోనే వికాసం సాధ్యమన్నారు. సర్కారు బడుల్లో మాతృభాష తెలుగుతో పాటు, ఆంగ్లం బోధనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రస్తుతం అములో ఉన్న సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే సీఎం జగన్‌కు పూర్తి అండగా ఉండాలని ఆయన కోరారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, ఎంపీటీసీ ఇంజేటి కృష్ణవేణి, ఉపసర్పంచ్ చెంపాటి రామకృష్ణంరాజు, వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు జాన శంకరరావు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కారుపర్తి నాగేశ్వరరావు, నాయకులు ఇంజేటి విజయ్‌కుమార్, చింతా సుధాకర్‌రావు, ఓగూరి బాబులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి



ఆలమూరులో జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఆలమూరు: అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించడం ద్వారా బంగారు భవిష్యత్‌ను కల్పించడానికి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష ఇన్‌చార్జి తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో ఎంపీపీ లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, తహసీల్దార్ ఐపీ శెట్టి పాల్గొని ప్రసంగించారు. మండలంలోని ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ముందుగా రూపొందించిన. షెడ్యూల్ వారీగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని లబ్ధిదారులందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఈఓపీఆర్డీ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

మండలంలోని పెదపళ్ల, సూర్యారావుపేట గ్రామ సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్షపై అవగాహన సదస్సు జరిగింది. ఇన్‌చార్జిలు తమ్మన శ్రీనివాసు, నామాల శ్రీనివాసు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు యేడిద సత్యశ్రీ, చింతపల్లి వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. 'జగనన్న సురక్ష'పై గ్రామాల్లోని లబ్ధిదారులందరికీ అవగాహన కల్పించాలని కోరారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, గొడితి వెంకన్న, చింతపల్లి నాగేశ్వరరావు, కడలి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ అమలు చేస్తున్నారని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. సర్పంచ్ రేవతి మాట్లాడుతూ కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్న ఆశయంతో నూతన కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



మోడేకుర్రులో విద్యార్థులను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి పేద, మధ్యతరగతి విద్యార్థికి ఉన్నత భవిష్యత్ కల్పించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మండలంలోని బిళ్లకుర్రు శివారు కొత్తపాలెం, మోడేకుర్రు, గొలకోటివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే లక్ష్యంతో వివిధ ప్రోత్సాహక, ఆర్థిక సహాయక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఆయా పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన గుబ్బల వర్షిణీదేవి, తొత్తరమూడి సంతోష్, గుత్తుల లక్ష్మణరావు, పితాని వెంకట వంశీకృష్ణ, ఆకుల కార్తిక సుగంధిధనలక్ష్మి, మట్టపర్తి ఉమాశంకర్, అడపా సూర్యదుర్గ, ఎల్‌పీపీఎస్‌డీ గంగాభవాని, కె.హరిణి సుభద్రశ్యామసాయి, బీర వెంకటలక్ష్మిలను శాలువాలతో సత్కరించి, మెడల్స్, వరుసగా రూ.3, 2, వెయ్యి చొప్పున ఎంపీపీ చేతుల మీదుగా ప్రదానం చేశారు. సర్పంచ్‌లు నెల్లి లక్ష్మీపతిరావు, కుడుపూడి రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు బొక్కా నాగరాణి, రెడ్డి శ్రీనివాస్, పీఏసీఎస్ పర్సన్ చోడపనీడి చిన్న, హెచ్ఎంలు, పీఎంసీ చైర్మన్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానం



రాజోలు మనో వికాస కేంద్రంలో అన్నదానం చేస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

మామిడికుదురు: మామిడికుదురు మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రాజోలు మనో వికాస కేంద్రంలో శనివారం అన్నదానం నిర్వహించారు. సేవా సంస్థ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ అన్నదానం జరిగింది. తమ సంస్థ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బత్తుల శ్రీరామ్ కుమార్, రమణ, ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి పోవద్దు

రావులపాలెం: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లి భవిష్యత్తుని పాడు చేసుకోవద్దని కొత్తపేట ఎస్ఈబీ సీఐ సీహెచ్ అరుణమ్మ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఐక్యూ ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మత్తుపదార్థాల నిషేధ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అలాగే ఆరోగ్యపరంగా, సమాజంలో విలువల పరంగా జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. అలాగే యువత మత్తు పదార్థాల వైపు వెళ్లకూడదని వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.చిన్నబాబు, ఎస్సై అన్నవరం, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ సుభాషిణి, పీడీ యువరాజు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పాలవెల్లువ సభలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు, విలస గ్రామ పంచాయతీల వద్ద జగనన్న పాలవెల్లువపై పశువైద్యాధికారి రేవంత్ బుధవారం గ్రామసభలు నిర్వహించారు. పాల ఉత్పత్తులతో రైతులు అదనపు ఆదాయం సముపార్జించవచ్చన్నారు. ఈ సదస్సు గ్రామ సర్పంచులు కుసుమ లిల్లీమంగేష్కర్, వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు శనివారం రూ.11 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన దుర్గారావు స్థానికంగా ఉన్న హోటల్‌లో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత మేనెలలో హోటల్ నుంచి ఇంటికి వెళ్తున్నప్పుడు రోడ్డు దాటుతుండగా వ్యాన్ ఢీ కొట్టడంతో కాలు విరిగిపోయింది. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ జరగడంతో కోలుకుని ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబ పోషణ చాలా కష్టంగా మారడంతో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం కోరారు. కుటుంబ పోషణ నిమిత్తం రూ.11 వేలు ఆర్థిక సాయం అందజేసినట్టు కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు తెలిపారు.

పౌష్టికాహార లోపం నివారణకు చర్యలు తీసుకోవాలి

ఆలమూరు: బాలింతలు, గర్భిణులు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య రక్షణ కోసం, పౌష్టికాహార లోప నివారణకు ఆరోగ్య అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో వైద్యారోగ్య బృందం గ్రామాల్లో పర్యటించి పౌష్టికాహార లోప నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అలాగే పలు గ్రామాల ముఖ్యకూడళ్లతో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

అంబాజీపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఇంటి నుంచి అదృశ్యమైందని ఆమె భర్త ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కె.పెదపూడికి చెందిన ఓ వివాహిత ఈ నెల 21న భార్యాభర్తల మధ్య ఏర్పడ్డ చిన్నపాటి గొడవ వల్ల ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కూలి పనికి వెళ్లిన ఆమె భర్త యడ్ల వెంకటేశ్వరరావుకు తన ఇంటి వద్ద కనిపించడం లేదని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారన్నారు. దాంతో వెంకటేశ్వరరావు అతని భార్య కోసం గాలించినప్పటికి ఫలితం లేకపోయింది. దీంతో తన భార్య కనిపించడం లేదంటూ వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జీవీ వరప్రసాద్ తెలిపారు.

సంక్షేమ సారథికి అండగా నిలవండి



జి.అగ్రహారంలో లబ్ధిదారులకు బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: పథకాల అమలులో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన సంక్షేమ సారథి జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలంతా అండగా నిలిచి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలన్నది సీఎం జగన్ ఆశయమన్నారు. అదే విధంగా ఎమ్మెల్యేగా తాను తన ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ప్రధాన రహదారిని నిర్మించాలని, మురుగునీరు పోయేలా డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, హౌసింగ్ లోన్‌లు ఇప్పించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే చిట్టిబాబును కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, దొమ్మేటి సత్యమోహన్, బొంతు శ్రీనివాస్, పులిదిండి ఏడుకొండలు, మట్టపర్తి యజ్ఞశ్రీ, రాయుడు కృష్ణమహేష్, వాసంశెట్టి పెదబాబు, రాయుడు మీరయ్య, దొమ్మేటి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

మలికిపురం: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మలికిపురంలో ఆదివారం నిర్వహించే వారాహి యాత్ర కోసం ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నట్టు కొత్తపేట డీఎస్పీ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మలికిపురంలో బహిరంగ సభను దృష్టిలో పెట్టుకుని మలికిపురంలోకి మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎలాంటి వాహనాలను అనుమతించమన్నారు. రాజోలు, శివకోడు ప్రాంతాల నుంచి సఖినేటిపల్లి వెళ్లే వాహనాలు మేడిచర్లపాలెం నుంచి భూపతివారి పేట మీదుగా వెళ్లాలని, సఖినేటిపల్లి నుంచి రాజోలు వైపు వెళ్లే వాహనాలు మలికిపురం గాంధీ బొమ్మల సెంటర్ నుండి విశ్వేశ్వరాయపురం వంతెన మీదుగా వెళ్లాలన్నారు. వారాహి బహిరంగ సభకు రాజోలు, శివకోడు నుంచి వచ్చే వారు వయా మేడిచర్లపాలెం, గుడిమెళ్లంక మీదుగా వచ్చి వారి వాహనాలను విజయా ఆస్పత్రి పక్కన సీసీ రోడ్డుపైన, సత్యజ్యోతి, పద్మజ థియేటర్ల వెనుక ఉన్న లేఅవుట్ ప్రాంతంలో పార్కింగ్ చేయాలన్నారు. సఖినేటిపల్లి నుంచి వచ్చే వాహనాలను మలికిపురంలోని బుచ్చిరాజు, కేఎస్ఎస్ రాజు లే అవుట్లలో నిలపాలన్నారు. లక్కవరం, విశ్వేశ్వరాయపురం నుంచి వచ్చే వాహనాలను గుడిమెళ్లంక వంతెన పక్కన ఉన్న డాక్టర్ ప్రమీలకు చెందిన స్థలంలో, పెట్రోల్ బంక్ రాజబాబు ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాలన్నారు. సాధారణ ట్రాఫిక్, శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సహకరించాలని డీఎస్పీ కోరారు.

రాష్ట్రస్థాయి చెస్‌కు ఎంపిక

అమలాపురం టౌన్: అండర్–9 జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ చూపిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన పితాని ధ్యాన సత్య కార్తీక్ (ప్రథమ), ఆలమూరు మండలం చొప్పెల్లకు చెందిన గుత్తుల వెంకట శివరామ్ (ద్వితీయ), అమలాపురానికి చెందిన అంకెం తరుణ్ తేజ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. అలాగే, బాలికల విభాగంలో అల్లవరం మండలం బెండమూర్లంకకు చెందిన గిడుగు వాత్సల్య (ప్రథమ), ఆలమూరుకు చెందిన చిప్పాడ గీతిక (ద్వితీయ) స్థానాలు సాధించారు. ఈ ఐదుగురూ శని, ఆదివారాల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు శనివారం ఉదయం బయలుదేరి వెళ్లారు.

ఉత్తమ ఉపాధ్యాయులను సమాజం మరవదు



కె.ఏనుగుపల్లిలో బదిలీ అయిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ఉత్తమ విద్య అందించిన ఉపాధ్యాయులను సమాజం ఎన్నటికీ మరవదని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. కె.ఏనుగుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సర్పంచ్ తోలేటి బంగారునాయుడు అధ్యక్షతన ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టం చేశారని అన్నారు. ఉత్తమ బోధన అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని అన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప్పలపాటి మాచిరాజు, ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, నాయకులు సూదా శ్రీను, గంధం వెంకటేశ్వరరావు, గంధం ఏసు, పితాని నాగేశ్వరరావు, యల్లమెల్లి సత్యనారాయణ, ప్రసాద్, కడలి సీతారాముడు, పుచ్చకాయల చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పెదపట్నంలంకలో నేడు గడప గడపకూ..

మామిడికుదురు: పెదపట్నంలంకలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలన్నారు. అనంతరం అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయంలో జరిగే ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చిట్టిబాబు పాల్గొంటారని చెప్పారు.

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే 11 రకాల సర్వీసులు

అయినవిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు 11 రకాల సర్వీసులు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు స్థానిక ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ తెలిపారు. శనివారం అయినవిల్లి–1, అయినవిల్లిలంక గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మలు రెండు బృందాలుగా వీడిపోయి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీరు మాట్లాడుతూ ఈ పథకంలో కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్ మరియు టైటిల్ డీడ్ పట్టాదారు పాసు పుస్తకం, వివాహ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం,ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ లింక్ చేయుట, కౌలు రైతులు కార్డు,కొత్త మరియు స్ప్లిట్ రేషన్ కార్డ్స్, హౌస్ హోల్డ్ స్ప్లిట్ చేస్తామని తెలిపారు. సచివాలయ స్థాయిలోని సమస్యలను పరిష్కరించి, ప్రతి పౌరుడి ముఖంలో చిరునవ్వు చూడడమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నట్లు తెలిపారు.